కొత్త సార్లూ.. సమస్యల స్వాగతం..

కార్యదర్శుల బదిలీలతో గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడే

- రహదారులను మూసేసిన పిచ్చిమొక్కలు
- ఫాగింగ్ లేక దోమల బెడద
- సీజనల్ వ్యాధుల వేళ పల్లెల్లో ప్రజల ఇక్కట్లు



21పిట్ ఏరియాలో ఇళ్ల వెంట రెండువైలా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ఇల్లెందురూరల్: గ్రామ పంచాయతీలకు సుదీర్ఘకాలంగా సేవలందించిన కార్యదర్శులలో పలువురు బదిలీ కాగా.. కొత్త కార్యదర్శులు విధుల్లో చేరారు. అయితే, బదిలీ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే గత కార్యదర్శులు పాలనను పక్కన పెట్టగా.. ఇంకొన్ని చోట్ల ఖాళీలు భర్తీకాక.. మిగతా ప్రాంతాల్లో కొత్త కార్యదర్శులు వచ్చినా పాలన గాడిలో పడలేదు. ఫలితంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్య నానాటికీ తీవ్రమవుతుండగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాల్సిన వేళ

సాధారణంగా జూలై, ఆగస్టుల్లో వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలోనే వీధుల్లో పిచ్చిమొక్కలు పెరగడం, కాల్వలు, వృథా స్థలాల్లో వర్షపు నీరు చేరి దోమల ఉత్పత్తికి ఆవాసంగా మారతాయి. ఈ సమయాన పంచాయతీల్లో కార్యదర్శులు మల్టీపర్పస్ వర్కర్లను వినియోగించి పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేయించాలి. దోమల ఉధృతి నివారణకు ఫాగింగ్ చేపట్టాలి. కానీ పల్లెల్లో అధికారులు ఈ విషయాలను విస్మరిస్తున్నారు. గ్రామాల్లో కేవలం ఇంటింట చెత్త సేకరణ మినహా ఇతర పనులపై దృష్టి సారించడం లేదు. వర్షాకాలంలో చేపట్టాల్సిన స్పెషల్ శానిటేషన్ పనులను పూర్తిగా అటకెక్కించారు. కొన్ని పంచాయతీల్లో పనులు పర్వాలేదనిపించినా చాలా చోట్ల వీధులు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, మురుగు గుంతలతో దర్శనమిస్తున్నాయి. మురుగు చేరిన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం మరిచిపోయారు. అంతేకాక జీపీల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని ఆదేశించింది. వర్షాకాలం కావడంతో ఈ కార్యక్రమాన్ని మంగళవారం కూడా నిర్వహించాలని సూచిస్తే వైద్యశాఖ ఉద్యోగులు మాత్రమే పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ అధికారులు కనీసం అందులో భాగస్వాములు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పల్లెల్లో వణికిస్తున్న జ్వరాలు

పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో దోమల ఉధృతి అధికమైంది. ఏ పల్లెలో చూసినా జ్వరపీడితులు అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. దోమకాటు కారణంగా ప్రతీ పల్లెలోనూ కనీసం ఇంటికొకరు జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం తగ్గిన వారు కీళ్ల నొప్పులతో నడవలేని స్థితికి చేరారని తెలుస్తోంది. జ్వరం తగ్గినా పక్షం రోజులపాటు నొప్పులతో ఇబ్బందిపడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కేవలం పారిశుద్ధ్య లోపం వల్లే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి.

నామమాత్రంగా నివారణ చర్యలు

జ్వరాల ఉధృతికి ప్రధాన కారణంగా నిలుస్తున్న పారిశుద్ధ్యం మెరుగుదల, దోమల నివారణపై పంచాయతీల్లో నామమాత్రపు చర్యలే కనిపిస్తున్నాయి. పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్ ఎక్కడా కనిపించకపోగా ఫాగింగ్ నామమాత్రమైంది. ఏటా వర్షాకాలంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా చాలా జీపీల్లో అవి మొరాయించడంతో మొక్కుబడిగా వీధుల్లో వాటిని తిప్పి మమ అనిపిస్తున్నారు. కనీసం మరమ్మతులకు గురైన ఫాగింగ్ యంత్రాలను బాగు చేయించకుండా మూలన పడేయడంతో దోమల ఉధృతి పెరగడానికి కారణమవుతోంది.



ఇందిరానగర్‌లో రహదారి వెంట చెత్త

దోమలు, పాముల బెడద అధికమైంది



వీధులు, ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. చెట్లు కూడా పెరిగి దోమలు, విషసర్పాలకు ఆవాసమయ్యాయి. దోమల బెడదతో జ్వరాలు పెరిగాయి. పాములు నేరుగా ఇళ్లలోకి వస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

–మెరుగు రవి, 21పిట్ ఏరియా, ఇల్లెందు మండలం

పారిశుద్ధ్య పనులు మెరుగుపరుస్తాం



జీపీల్లో ప్రస్తుతం బదిలీపై వచ్చిన కార్యదర్శులు చేరారు. బదిలీ ప్రక్రియ, ఆ తర్వాత విధుల్లో చేరడంతో పనులపై కొంత ప్రభావం పడింది. ఇకపై వెంటనే పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తాం. ప్రతీ గ్రామంలోనూ ఫాగింగ్ చేయిస్తాం.

–చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు మండలం

క్లుప్తంగా

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సమ్మయ్య

పాల్వంచ: ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య తెలిపారు. పాల్వంచలోని కేఎల్ఆర్ ఫార్మసీ కళాశాలలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌డే, ఫేర్‌వెల్ డేలో పాల్గొన్న ఆయన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి మాట్లాడారు. ఏటా ఫార్మసీ రంగానికి డిమాండ్ పెరుగుతున్నందున విద్యార్థుల భవిష్యత్‌కు డోకా ఉండదని తెలిపారు. విద్యార్థులు ఈ రంగంలో రాణిస్తూ పరిశోధనలపై దృష్టి సారించాలని చెప్పారు. కళాశాల చైర్మన్ కె.నాగమణి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పురుషోత్తం, డైరెక్టర్లు సిద్ధార్థరెడ్డి, సి.విశ్వనాథం, మురళీప్రసాద్, డాక్టర్ అఖిల, అధ్యాపకులు రజిత, శిరీష, అలీబా, శ్రీదేవి, రామస్వామి, హసీనా పాల్గొన్నారు.

బస్సుయాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: సీపీఎం బస్సుయాత్ర ఈ నెల 5న ముగుస్తున్నందున కొత్తగూడెంలో నిర్వహించే బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని సీపీఎం నాయకుడు రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం కేటీసీలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అందరికీ కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 4న ఇల్లెందు, 5న సత్తుపల్లి, కొత్తగూడెంలలో బస్సుయాత్ర నిర్వహించి, సాయంత్రం ముగింపు సభ ఏర్పాటు చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో ఈసం నరసింహారావు, కె.వీరన్న పాల్గొన్నారు.

నేడు ఇల్లెందుకు బస్సుయాత్ర

ఇల్లెందు: సింగరేణి పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సుయాత్ర ఆదివారం ఇల్లెందుకు చేరుతుందని సీపీఎం మండల కార్యదర్శి నబీ శనివారం తెలిపారు. జేకే ఓసీలో ఉదయం 7 గంటలకు ఫిట్ మీటింగ్, 10 గంటలకు కొత్త బస్టాండ్ వద్ద సభ ఉంటుందని వివరించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జినుగు అరుణ్, తాళ్ల రాజేశ్, ఎల్.గౌతమ్, షేక్ షాను, మాలిక్, దీపక్, మోహిన్, కందాల విజయ్‌కుమార్, రాచకొండ సాయి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి

పాల్వంచ: జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలనీ సీపీఐ నాయకుడు ముత్యాల విశ్వనాథం కోరారు. ఈ సందర్భంగా శనివారం పాల్వంచ డీఎస్పీ సతీశ్ కుమార్‌కు ఆయన వినతిపత్రం అందించి మాట్లాడారు. హైవేపై పాల్వంచ మీదుగా వందలాది వాహనాలు తిరుగుతున్న క్రమాన దమ్మపేట సెంటర్, అంబేడ్కర్ సెంటర్, బస్టాండ్ సెంటర్లలో సిగ్నళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు అడుసుమల్లి సాయిబాబు, నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావు, శనగారపు శ్రీనివాసరావు, మన్యం వెంకన్న, జకరయ్య, లాల్‌పాషా, కోమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

6,7 తేదీల్లో విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు

జూలూరుపాడు: ఈ నెల 6, 7 తేదీల్లో పాల్వంచలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు యశ్వంత్, చరణ్, అభిమిత్ర తెలిపారు. శనివారం జూలూరుపాడు హైస్కూల్‌లో వారు మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులను రాయల్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పవన్, అనిల్, శివమణి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

కొత్తగూడెంఅర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి తెలిపారు. శనివారం వార్డులోని ఖాళీ స్థలాల్లోని చెట్ల పొదలను సిబ్బంది చేత తొలగించారు.

మహిళలకు ఈనెల 6న పరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సేవా సమితి ద్వారా వృత్తి శిక్షణ పొందిన మహిళలకు ఈ నెల 6న పరీక్ష నిర్వహించనున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) శామ్యూల్ సుధాకర్ తెలిపారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని సేవా సమితి ఆధ్వర్యాన ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం అంశాల్లో శిక్షణ పూర్తయిందని చెప్పారు. ఆయా అభ్యర్థులకు ఈ నెల 6న సింగరేణి ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి హైదరాబాద్ ఖాదీ గ్రామోద్యోగ్ ద్వారా సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్ ఫొటోలు, ఇతర విద్యార్హతల సర్టిఫికెట్లు ఉంటే తీసుకురావాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన హెచ్ఎంలు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానిలోని గిరిజన క్రీడా ఆశ్రమపాఠశాల హెచ్ఎంగా లోడిగ రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ హెచ్ఎంగా ఉన్న చందు అశ్వాపురం మండలం గొందిగూడెం పాఠశాలకు బదిలీ కాగా, ఆయన స్థానంలో రామారావు నియమితులయ్యారు. అలాగే, ఉల్వనూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్ఎం పద్మ రొంపేడుకు బదిలీకాగా ఆమె స్థానంలో నియమితులైన కె.విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారని డీటీడబ్ల్యూఓ చంద్రమోహన్ తెలిపారు.

ట్రాక్టర్ సామగ్రి చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీకి సంబంధించి ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైంది. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం జీపీ వద్ద ట్రాక్టర్‌ను నిలపగా, శనివారం ఉదయం కల్లా బ్యాటరీ కనిపించలేదు. చోరీకి గురైందని భావించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వనమహోత్సవం



సూపర్‌బజార్(కొత్తగూడెం): మొక్క నాటుతున్న ఆర్ఎం సత్యనారాయణ తదితరులు



కొత్తగూడెంటౌన్: మొక్కలు అందజేస్తున్న లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. రీజినల్ మేనేజర్ సత్యనారాయణ మొక్కలు నాటి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు పెంచాలన్నారు. తమ బ్యాంకు శాఖల ఉద్యోగులంతా వన మహోత్సవంలో భాగస్వాములవుతారని తెలిపారు. కార్యక్రమంలో రమేశ్‌కుమార్, శ్రీనివాసరావు, అబ్దుల్ ఇజాజ్, హమీద్‌ఖాన్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

కొత్తగూడెంటౌన్/కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని 29వ వార్డు కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలు అందించారు. కార్యక్రమంలో గౌసియా, లక్ష్మీ, గుణలక్ష్మీ, విజయలక్ష్మీ, శిరీషా, భాగ్యలక్ష్మీ, జయమ్మ పాల్గొన్నారు.

మొక్కలతోనే కాలుష్య నివారణ

పాల్వంచరూరల్: వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి విరివిగా మొక్కలు నాటడమే మార్గమని మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పాండురంగాపురంలో శనివారం వనమహోత్సవంలో భాగంగా రైతువేదిక, హైస్కూల్ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మొక్కలు నాటడమే కాక సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్, సీఈఓ లక్ష్మీనారాయణతో పాటు భూక్యా శంకర్, మైనేని వెంకటేశ్వరరావు, సీహెచ్ పాపారావు, భూక్యా కిషన్ తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: మొక్క నాటుతున్న కొత్వాల శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు

రేపటి నుంచి ‘స్వచ్ఛదనం–పచ్చదనం’



మాట్లాడుతున్న చైర్మన్ డి.వెంకటేశ్వరరావు

ఇల్లెందు: ఈ నెల 5 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సూచించారు. ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆయన రాష్ట్రంలోనే ఇల్లెందును ముందంజలో నిలిపేలా కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ తొలిరోజైన సోమవారం జగదాంబ సెంటర్‌లో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ ప్రారంభిస్తారని, ఆతర్వాత గోవింద్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి డీఆర్‌సీసీ కేంద్రం వద్ద శ్రమదానం ఉంటుందని తెలిపారు. అలాగే, 6వ తేదీన ఇంకుడు గుంతలు ఏర్పాటు, 7న మురుగునీటి గుంతలు పూడ్చడం, 8న ఆరోగ్య సంరక్షణ, వీధి కుక్కల గుర్తింపు, 9వ తేదీన పరిశుభ్రత, మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ అంకెపాక నవీన్, మేనేజర్ అంకుషావలి, డీఈ మురళీకృష్ణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వం సహకరించాలి..

కొత్తగూడెంటౌన్: ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాలకు ప్రభుత్వం సహకరించాలని విశ్వబ్రాహ్మణ అర్చక, పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు ఉద్దోజు రామాచారి కోరారు. శనివారం పట్టణంలోని మేదరబస్తీలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యశ్వంత్‌శర్మ, గోవర్ధనాచారి, విక్రమాచారి, రవికుమారాచార్యులు, నామోజ్ గోవిందాచారి, ముత్తోజు లక్ష్మణాచారి, ఆనందాచారి, పోలోజు సత్యనారాయణ పాల్గొన్నారు.

సున్నం రాజయ్యకు ఘన నివాళి

జూలూరుపాడు: సీతారామ నీళ్లు జూలూరుపాడు మండలానికి సాధించడమే మాజీ ఎమ్మెల్యే, దివంగత సున్నం రాజయ్యకు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. శనివారం జూలూరుపాడు పార్టీ కార్యాలయంలో సున్నం రాజయ్య 3వ వర్ధంతిని నిర్వహించారు. రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాసా నరేశ్, గార్లపాటి వెంకటి, బానోత్ ఇస్రా, బానోత్ మధు, వల్లమల చందర్‌రావు, గడిదేశి కనకరత్నం, లకావత్ శ్రీను, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: స్థానిక సీపీఎం కార్యాలయంలో వీర్ల రమేశ్ అధ్యక్షతన సున్నం రాజయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేత కాసాని ఐలయ్య రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, రాసాల హనుమంతు, వీర్ల ముత్తయ్య, కృష్ణ, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా రాములు

టేకులపల్లి: సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా ఇస్లావత్ రాములునాయక్‌ను ఎన్నుకున్నారు. శనివారం సేవాలాల్ ఆలయంలో జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు, ప్రణాళిక కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్‌చంద్‌నాయక్ మండల కమిటీని ప్రకటించి, నియామక పత్రాలు అందించారు.

సాయిరాంతండాలో తీజ్ వేడుకలు



బుట్టలతో బయలుదేరిన యువతులు

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండాలో గిరిజన యువతులు, మహిళలు తీజ్ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. తీజ్ బుట్టలను యువతులు, మహిళలు, చిన్నారులు తలపై పెట్టుకొని మేళతాళాలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి, చెరువులో నిమజ్జనం చేశారు.

సీఈఓపై చర్యలు తీసుకోవాలని ధర్నా

టేకులపల్లి: డీసీసీబీ ఖమ్మం జిల్లా సీఈఓ రైతులను ఇబ్బందికి గురిచేస్తున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు బాణోతు ఊక్లానాయక్, సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోకన్వీనర్ మాలోత్ శివనాయక్ పేర్కొన్నారు. శనివారం బేతంపూడి సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ధరావత్ కృష్ణ, కృష్ణనాయక్, బాలాజీనాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

లాభాలను ప్రకటించాలి

ఇల్లెందు: సింగరేణి 2024–25 వార్షిక లాభాలను ప్రకటించాలని జీఎల్‌బీకేఎస్ డిమాండ్ చేసింది. శనివారం జీఎల్‌బీకేఎస్ నేతలు డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బయ్యా వరప్రసాద్ మాట్లాడుతూ.. సింగరేణిలో లాభాలను 35 శాతం ప్రకటించి కార్మికులకు అందజేయాలని కోరారు.

పెరిగిన వ్యవసాయ కూలీ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం పరిధి గ్రామాల్లో వ్యవసాయ కూలీ పెరిగింది. కొమరారం గ్రామపంచాయతీ వద్ద న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ నేతల సమక్షాన శనివారం నిర్వహించిన చర్చల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. చర్చల్లో బానోత్ సంతు, శ్రీరాం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

సుజాతనగర్: స్థానిక వికలాంగులకు బస్‌పాస్‌లను కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ ఇసనపల్లి శామ్యూల్ శనివారం అందించారు. సుజాతనగర్ ఎంపీపీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవి



ఇల్లెందురూరల్: బాలింతకు తల్లిపాల ప్రాధాన్యత వివరిస్తున్న సిబ్బంది



టేకులపల్లి: బేతంపూడిస్టేజీలో గర్భిణికి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇల్లెందురూరల్: ప్రతి బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి అన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను, పలు గృహాలను సందర్శించి బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అందించాల్సిన ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. పోతపాలు బిడ్డ ఆరోగ్యానికి చేటు తెస్తాయని సూచించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండలంలోని టేకులపల్లి, సులానగర్, బోడు, గంగారం, బొమ్మనపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పోషకాహారం వల్ల కలిగే లాభాలు, ముర్రుపాల విశిష్టత, తల్లి, బిడ్డ, గర్భిణులు ఎలాంటి ఆహారం తీసుకోవాలి? బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై సూపర్‌వైజర్లు అవగాహన కల్పించారు. అనురాధ, నిర్మల, లక్ష్మీ, సక్కుబాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటంతో ఫలితం దక్కింది..



కొత్తగూడెంఅర్బన్: నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పోరాటంతో ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కూసపాటి శ్రీను అన్నారు. శనివారం గాజులరాజంబస్తీ ఏరియాలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మారపాక రమేశ్, బండారి రజిని, పుల్ల ప్రవీణ్, ప్రవీణ్‌కుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

పాల్వంచ: ఎస్సీ, ఉపకులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచలో శనివారం నిర్వహించిన విజయోత్సవ వేడుకలో ఆయన మాట్లాడారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కొత్తపల్లి సోమయ్య, శ్రీను, యాకయ్య, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, నూకల రంగారావు, మహిపతి రామలింగం, ముత్యాల విశ్వనాథం, అడుసుమిల్లి సాయిబాబు, చింతలచెర్వు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సహకరించాలి

కొత్తగూడెంరూరల్: పేద విద్యార్థుల చదువుకు సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం పరిధిలోని నాలుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. నోట్ పుస్తకాల పంపిణీకి మూడు సంపత్‌కుమార్ ముందుకు రావటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూనవత్ గోవిందు, జర్పుల ఉపేందర్, బోడ రాములు, బానోతు నెహ్రూ, మోహన్, భద్రు, వినోద్‌కుమార్, బాలు, పరశురాం, చింటూ, గుమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ బాటిళ్లు అందజేస్తున్న సాబీర్‌పాషా

రాజ్యాధికారం దక్కే వరకు విశ్రమించొద్దు..

కొత్తగూడెంఅర్బన్: రాజ్యాధికారంతోనే బహుజనుల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ అన్నారు. కొత్తగూడెంలోని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీఎస్పీ జిల్లా నూతన కమిటీ ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా కాంపాటి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ వీరునాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా రవి, కోశాధికారిగా మల్లికార్జున్‌రావును ఎన్నుకున్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న ఎర్రా కామేశ్